కథ

# ప్రేమికుల (దుర్) దినం

- వంగీపురం పద్మనాభన్

**బ్రహ్మ**ముహూర్తానికే నిద్రలేచాడు సుబ్బారావ్. తను రెండు రోజుల క్రితం వేసిన ప్లాన్ గురించి తలచుకుంటేనే అతనికి ఒళ్ళు పులకరిస్తోంది. ఆ క్షణాలు ఎప్పుడొస్తాయా అని ఆతృతతో ఉన్నాడు.

తను బ్రష్ చేసుకుని బెడ్‌రూమ్ వైపు వెళ్ళి లోపలికి తొంగిచూశాడు. భార్య సుజాత ఇంకా నిద్రలేవలేదు. ఒళ్ళు మండింది. మెంటల్‌గా ఇంత ప్రిపేర్ చేసినా ఇంకా లేవలేదు. తను లేచినపుడే భార్యను కూడా లేపాడు. కాని "ఇంకా ఐదు నిముషాలండి" అని మళ్ళీ నిద్రలోకి జారుకుంది. అదే కోపంతో లోపలికి పోయి భార్యను తట్టిలేపాడు.

భార్య చికాకుగా మొహంపెట్టి " ఏవిఁటండి! బాగా నిద్రొస్తోంది, డిస్టర్బ్ చేస్తారెందుకు' అని మళ్ళీపడుకో బోయింది.

"సుజా! రెండ్రోజుల క్రితం నీకొక ప్లాన్ చెప్పాను, మర్చిపోయావా?" అని అడిగాడు.

"వద్దండి! నాకెందుకో ఇష్టంలేదండి. ఇద్దరు పిల్లలున్న ఈ వయసులో అలా చేయడం బాగుండదండి." అని భర్తను అనుసరించడం ఇష్టంలేనట్లు మొహం పెట్టింది.

"సుజా ! పిల్లలెలాగూ మనతోరారు. రోజూలాగానే వాళ్ళు స్కూల్ నుండి రాగానే మా చెల్లి ఇంట్లో వుంటారు. కాకపోతే ఈరోజు ఓ రెండు గంటలు ఎక్కువసేపు వుంటారు. ఆ విషయాలన్నీ నేను చూసుకుంటాను కదా! నేను చెప్పింది చేయి చాలు" అంటూ సుజాత చెయ్యి పట్టుకుని లేపాడు.

ఇక లాభం లేదనుకుని సుజాత లేచి తయారవడం మొదలుపెట్టింది.

సుబ్బారావు ప్లాన్ ప్రకారం ఇంట్లో కాఫీ మాత్రం తాగి పదిగంటలకల్లా బైటపడటం.... ఆరోజు హ్యాపీగా గడపటం. టిఫిన్, భోజనం అన్నీ బయటే.... పిల్లలకు కావలసింది మాత్రం తయారుచేసి పెట్టడం.

> **సుబ్బారావు మంచి బ్లూ జీన్స్ దానిపైకి మిల్క్‌వైట్ షర్ట్ వేసుకున్నాడు. సుజాతకు కూడా డ్రస్ తనే సజెస్ట్ చేశాడు. ఎర్ర బార్డర్ వున్న ముదురు పసుపురంగు చీర దానికి మ్యాచింగ్‌గా ఎర్ర జాకెట్. చెవికి డ్రాప్స్, చేతికి మ్యాచింగ్ గాజులు దానికి బార్డర్ లాగా బంగారు గాజులు.**

సుబ్బారావుకు ఇద్దరు పిల్లలు. అమ్మాయి ఐదో తరగతి, అబ్బాయి నాలుగో తరగతి చదువుతున్నారు. ఇద్దరు ఆరోజు మామూలు టైమ్‌కే లేచారు. వాళ్ళను త్వరగా రెడీ చేసి స్కూలుకి పంపిస్తూ "పిల్లలూ రోజూలాగానే మీరు స్కూలు అవుతూనే అత్తయ్య వాళ్ల ఇంట్లో వుండండి, అల్లరి చేయకుండా వుండాలి. మేము రావడానికి కాస్త ఆలస్యం అవుతుంది" అన్నాడు సుబ్బారావు.....

ఇద్దరూ తొమ్మిది గంటల కల్లా ఫ్రీ అయ్యారు. సుజాతకు కూడా లోపల థ్రిల్లింగ్‌గా వున్నా లోలోపల భయంగా ఉంది.

సుబ్బారావు మంచి బ్లూ జీన్స్ దానిపైకి మిల్క్‌వైట్ షర్ట్ వేసుకున్నాడు. సుజాతకు కూడా డ్రస్ తనే సజెస్ట్ చేశాడు. ఎర్ర బార్డర్ వున్న ముదురు పసుపురంగు చీర దానికి మ్యాచింగ్‌గా ఎర్ర జాకెట్. చెవికి డ్రాప్స్, చేతికి మ్యాచింగ్ గాజులు దానికి బార్డర్ లాగా బంగారు గాజులు.

పదిగంటలకు బయట పడ్డారు. వెళ్తూ వెళ్తూ పక్కనే వున్న చెల్లి సుగుణ ఇంటికి వెళ్ళి పిల్లల గురించి చెప్తూ "రోజుకన్నా రెండు, మూడు గంటలు ఆలస్యమవుతుంది. సాయంత్రానికల్లా వచ్చేస్తాము. ఒక అర్జంటు పనిమీద వెళ్తున్నాము" అన్నారు.

**"సుజా ! నవ్వు పార్క్‌లోపలికి వెళుతూ వుండు. నేను నిన్ను ఫాలోఅవుతాను" అని పదహారేళ్ళ కుర్రాడిలా పోజు పెట్టాడు.**

"ఏంటన్నయ్యా ! టిప్ టాప్‌గా తయారయ్యారు, ఏదైనా ఫంక్షన్‌కు వెళ్తున్నారా?" అని అడిగింది సుగుణ.

"లేదే, మా కొలీగ్ ఒకాయనకి ఒంట్లో బాగోలేదు. సహాయానికి రమ్మన్నాడు. అందుకే వెళ్తున్నాము" అంటూ అదే నిజమని తలూపమని భార్యకు సైగచేశాడు.

"అవును సుగుణా పాపం వారి కొలీగ్ సహాయం అడిగారు, అందుకే వెళ్తున్నాము" అంది సుజాత భర్తవైపు కొరకొర చూస్తూ.

"ఒంట్లో బాగోలేని వాళ్ళకి సపర్యలు చేయడానికి ఇంత టిప్‌టాప్‌గా వెళ్ళాలా!" చిలిపిగా ప్రశ్నించింది సుబ్బారావు ఏదో అబద్ధం చెప్తున్నాడని పసిగట్టిన సుగుణ.

"నీట్‌గా వెళితే వాళ్ళకు కూడా మానసికంగా ఉల్లాసంగా ఉంటుంది కదా ! డల్‌గా వెళితే వాళ్ళు కూడా డల్ అయిపోతారు. అందుకని"..... అని భార్యవైపు చూసి 'తెలివిగా చెప్పానా' అంటూ కళ్ళెగరేసాడు సుబ్బారావు.

'ఏడిసినట్టుంది' అన్నట్టు పెదవులు బిగించి అటూ, ఇటూ తిప్పింది.

"సరే ! ఆలస్యం దేనికి, వెళ్లిరండి" అంది సుగుణ వ్యంగ్యంగా.

ఇద్దరూ చట్టాపట్టాలేసుకుని బయటకు వచ్చారు. సుబ్బారావు మోటర్ బైక్ ఎక్కాడు. సుజాత వెనక కూర్చుంది. భుజం పైన చెయ్యి వెయ్యమన్నాడు సుబ్బారావు.

"అబ్బా ! నాకు అలవాటు లేదండి; నన్ను ఇబ్బంది పెట్టకండి" అంది.

"సుజాత! ఈరోజు మనకు స్పెషల్ అన్నాను కదా ! నన్ను డిస్సప్పాయింట్ చేయకు" అన్నాడు.

హతవిధీ అని భుజంపైన చెయ్యి వేసింది సుజాత.

సుబ్బారావు నల్లకళ్ళజోడు తగిలించాడు. బైక్‌ని స్టార్ట్ చేశాడు. బైక్ రయ్‌మని దూసుకుపోతోంది....

"మనం ఎటువైపు వెళ్తున్నామండి?" అని అడిగింది సుజాత.

"ఏమీ మాట్లాడకు. నేను చెప్పింది చేయి" అని రెట్టించిన ఉత్సాహంతో ఈలవేసుకుంటూ, తల ఆడిస్తూ జిగ్‌జాగ్‌గా బైక్‌ని నడిపిస్తున్నాడు. సుజాత భయం భయంగా కూర్చుంది. అప్పుడప్పుడు ఎత్తుపల్లాలు వచ్చినప్పుడు వెనక నుండి వినిపిస్తున్న ఆక్రందనలను అసలు పట్టించు కోవటల్లేదు.

పదినిముషాల్లో ఐదు కిలోమీటర్ల దూరంలో వున్న ఒక పార్క్‌ముందు ఆపాడు బైక్‌ని. షూటింగ్‌కి ముందుగానే లొకేషన్ చూసుకున్నట్లు సుబ్బారావు పార్క్‌ని రెండు రోజుల క్రితమే సెలెక్ట్ చేసుకున్నాడు.

భార్యను దిగమన్నాడు. తనుకూడా దిగి స్టాండ్ వేసి ఒకసారి తలదువ్వుకుని, బైక్ అద్దంలో చూసుకున్నాడు.

"సుజా ! నువ్వు పార్క్‌లోపలికి వెళుతూ వుండు. నేను నిన్ను ఫాలోఅవుతాను" అని పదహారేళ్ళ కుర్రాడిలా పోజు పెట్టాడు.

"అదేంటండి ! మనమిద్దరం భార్యాభర్తలం. ఎంచక్కా చేతిలో చేయి వేసుకుని వెళ్ళొచ్చుగా" అనింది.

"సుజా ! ప్రేమికుడే ప్రేమికురాలి వెంట పడ్తాడు. నీకు అన్నీ విడమరచి చెప్పడం నాకు కుదరదు. మరీ ఇంత ఛాదస్తం ఉంటే కష్టం" అని కోపంగా అన్నాడు సుబ్బారావు.

"హు" అని ఒక నిట్టూర్పు విడిచి కదిలించి సుజాత.

సుబ్బారావు అడుగులో అడుగు వేసుకుంటూ వెనకనుండి సుజాతనే చూస్తూ ఫాలో అయ్యాడు. ఇద్దరూ పార్క్ లోపలికి చేరారు. ప్రశాంతంగా ఉంది పార్కు. ఎండ కొంచెం ఎక్కువగా వున్నా చుట్టూ చెట్లు వుండడంతో చల్లగా ఉంది.

పార్కును నాలుగు భాగాలుగా విభజిస్తూ దట్టంగా రెండు అడుగుల క్రోటన్ పెంచారు. మధ్యలో నడవటానికి దారి విడిచి మిగిలిన భాగంలో లాన్ పెంచారు. కాలు పెట్టగానే వెల్వెట్టు వస్త్రం పైన కాలుపెట్టినట్లుగా మెత్తగా

ఉంది లాన్. మధ్యలో పదడుగులపైకి ఎగిసిపడే ఫౌంటెన్, దాని నుండి గాలిలోకి విడిపోయే తుంపరలు వొంటిని తాకుతుంటే ఎంతో హాయిగా వుంది.

గుబురుగా వున్న పొదల కోసం ఒకసారి పరికించాడు. పార్కులో ఒక్కొక్క భాగంలో రెండు మూడు గుబురు పొదలున్నాయి. బాగా నీడగా వున్న పొదవైపు నడిచాడు సుబ్బారావు....

ఆరోజు అంతా నిర్మానుష్యంగా వుండటం ఆశ్చర్యం కలిగించినా, ఒకందుకు మేలే అనుకున్నాడు.

పొద దగ్గర చేరుకున్నారు. సుజాతను కూర్చో మన్నాడు. తనుకూడా కూర్చున్నాడు.

ఒక నిమిషం మౌనంగా వున్నారు ఇద్దరూ.

"సుజా ! ఏమైనా మాట్లాడు" అన్నాడు సుబ్బారావు.

"ఏమ్మాట్లాడాలండి ! రోజూ మాట్లాడుకుంటూనే వున్నాం కదా !" అని అంది సుజాత.

"సుజా ! ఈరోజు మనం ప్రేమికులం. ఈ ఒక్కరోజు మనం భార్యాభర్తలన్న విషయం మర్చిపో, ఇప్పుడు చెప్పు నీ హాబీలేమిటి ?" అని కొత్తగా కలిసినట్లు అడిగాడు.

"ఆఁ.... అప్పడాల కర్రతో భర్త నెత్తిమీద ఒకటి మొత్తటం" అని గలగలా నవ్వింది.

"ఏంటి సుజా ! నీవు నన్ను డిస్సప్పాయింట్ చేస్తున్నావు. మనం కాసేపు ప్రశాంతంగా మాట్లాడుకుని తరువాత హోటల్‌కెళ్ళి భోంచేద్దాం" అన్నాడు సుబ్బారావు.

సుబ్బారావు డైరక్షన్‌లో సుజాత రెండుగంటల పాటు బాగా నటించింది.....

వాళ్ళు మాట్లాడుతుండగా వాళ్ళవైపే వస్తున్న మాటల, అడుగుల చప్పుడు వినిపించింది. చప్పుడు ఇంకా దగ్గరయ్యింది.

పదిమంది మగవాళ్ళు పార్క్ లోపలికి జొరబడ్డారు. వాళ్ళ మొహాలు కోపంగా వున్నాయి. అందరూ వీళ్ళ వైపే చూస్తున్నారు. ఆ గుంపులోంచి ఇద్దరు మాత్రం సుబ్బారావు జంట దగ్గరకు వచ్చారు. సుబ్బారావుజంట లేచి నుంచున్నారు.

**పదిమంది మగవాళ్ళు పార్క్ లోపలికి జొరబడ్డారు. వాళ్ళ మొహాలు కోపంగా వున్నాయి. అందరూ వీళ్ళ వైపే చూస్తున్నారు. ఆ గుంపులోంచి ఇద్దరు మాత్రం సుబ్బారావు జంట దగ్గరకు వచ్చారు.**

"ఎవరు మీరు" అని గద్దించాడు మొదటివాడు.

'మేము భార్యాభర్తలం...... ఇక్కడ రెస్టు తీసుకుం టున్నాము' అని అనబోయింది సుజాత.

సుబ్బారావు సుజాత కాలు నొక్కుతూ "మేము మంచి స్నేహితులమండి. ప్రేమించుకుంటున్నాము కూడా. పెళ్ళి గురించి మాట్లాడుకుంటున్నాము. అయినా మీరెవరు ఇవన్నీ అడుగుతున్నారు?" అని ఎదురుప్రశ్న వేశాడు సుబ్బారావు.

రెండోవాడు కొట్టడానికన్నట్టు చెయ్యి ఎత్తాడు. మొదటివాడు వారించాడు.

"మేమెవరమో నీకు తెలుస్తుందిలే, ఇద్దరూ పోలీస్ స్టేషన్‌కు పదండి" అన్నాడు మొదటివాడు.

ముందు దొంగలనుకున్నాడు సుబ్బారావు. వీళ్ళ దగ్గర నుండి ఏమీ అడక్కపోగా పోలీస్ స్టేషన్‌కి రమ్మంటున్నారు.

"మేమేం చేశామండీ పోలీస్‌స్టేషన్‌కి రమ్మంటున్నారు" అని విసురుగా అనబోతూ తమాయించుకున్నారు.

"అవన్నీ అక్కడే మాట్లాడుకుందాం పదముందు" అన్నాడు రెండోవాడు.

'ఇదేమి పరీక్షరా భగవంతుడా. ఎంజాయ్ చేద్దామని వస్తే ఇలా అయ్యిందేమిటి?' అని లోలోపలే సతమవు తున్నాడు సుబ్బారావు.

**సుబ్బారావుకి కాలికింద భూమి కదిలినట్లు అనిపించింది. భూమిలో నుంచి తన రక్తాన్నంతా లాగేసినట్లు నీరసించిపోయాడు.**

మొదటివాడు చెయ్యి బిగుతుగా పట్టుకోవడంతో ఈలోకంలోకి వచ్చాడు.

అయినా భార్యభర్తలే కాబట్టి పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళినా నచ్చచెప్పి వచ్చేయొచ్చు అనుకుని వాళ్ళ వెనకాలే బయలుదేరారు ఇద్దరూ.....

పక్క వీధిలో వున్న పోలీస్ స్టేషన్‌కి చేరారందరూ. ఇన్‌స్పెక్టర్ మొదట వారిని చూసి "ఏంటి గోపాల్ ఇటొచ్చారు?" అన్నాడు.

"సార్ ! ఈ రోజు ఇంకో లవ్ కేసు పట్టుకొచ్చాను" అని సుబ్బారావు జంటను ఇన్‌స్పెక్టర్‌కి అప్పజెప్పి "సార్ ! వీళ్ళని ఎంక్వయిరీ చేస్తూ ఉండండి. మేము కొద్దిసేపట్లో వచ్చేస్తాము" అని అందరూ వెళ్ళిపోయారు.

ఇంకో లవ్ కేసు పట్టుకోవడం ఏమిటి ? అంతా అయోమయంగా వుంది సుబ్బారావుకి.

"సార్ ! మమ్మల్ని ఎందుకు ఇక్కడికి తీసుకొచ్చారు? మేమేం తప్పు చేశాం ? ఇంతకీ మాతోపాటు వచ్చిన వాళ్ళెవరు?" అని ప్రశ్నల వర్షం కురిపించాడు సుబ్బారావు.

"నువ్వేమైనా వన్‌మ్యాన్ ఎన్‌క్వయిరీ కమీషనా నన్ను ప్రశ్నిస్తున్నావు" అని కోపంగా అంటూ తన టేబుల్ వైపు వెళ్ళాడు ఇన్‌స్పెక్టర్.

సుబ్బారావు తన ప్లాన్ పాడయినందుకు గుర్రుగా ఇన్‌స్పెక్టర్ వైపే చూస్తూ ఉండిపోయాడు.

ఇన్‌స్పెక్టర్ తన టేబుల్‌పైన ఉన్న లాఠీని చేతిలోకి తీసుకొని రెండు చేతుల మధ్య ఆడిస్తూ సుబ్బారావు వైపే వస్తున్నాడు.

సుబ్బారావుకి కాలికింద భూమి కదిలినట్లు అనిపించింది. భూమిలో నుంచి తన రక్తాన్నంతా లాగేసినట్లు నీరసించిపోయాడు.

"ఏ ఏరియా మీది ! ఈవిడని ఎక్కడనుంచి కొట్టుకొచ్చావ్?" ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్.

సుబ్బారావుకి చిర్రున కోపం వచ్చింది. తన జుట్టు పోలీసుల చేతిలో వుండడంతో చేసేది లేక "అశోక్‌నగర్ సార్. ఈవిడ నా భార్య సార్" అన్నాడు.

"అవును మేము అగ్నిసాక్షిగా పెళ్ళి చేసుకున్నాము" అని జాకెట్ లోపలికి దోపిన తాళిబొట్టును తీసి చూపించింది.

"వెధవ పనులు చేసేవాళ్ళు ఇలాంటి ఆధారాలు రెడీగా వుంచుకుంటారు. అది మాకు బాగా తెలుసు" అని పెద్ద డిటెక్టివ్ లాగా పోజు పెట్టాడు ఇన్‌స్పెక్టర్.

"మరి మీరు పార్క్‌లో పట్టపగలు ఏం చేస్తున్నారు?" అని సుజాత కళ్లల్లోకి సూటిగా చూస్తూ ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్.

సుజాత మౌనంగా తలవంచుకుని కుడికాలి బొటనవేలితో నేలమీద రాస్తూ నుంచుంది.

"ఏమ్మా నువ్వు నేల మీద అలా కోడ్ వర్డ్స్‌తో రాస్తే అది మేము డీకోడ్ చేసుకోవాలా ?" అని సుబ్బారావు వంక చూశాడు.

సుబ్బారావు కూడా తలదించుకున్నాడు. దించుకున్న సుబ్బారావు తల చూస్తుంటే గ్లోబ్‌పైన ఇండియా మ్యాప్ చూసినట్టుంది. మధ్యలో ఇండియాలాగా జుట్టు. అటూ ఇటూ ఖాళీ.

"నోరు విప్పండి" అని కేకేసాడు ఇన్‌స్పెక్టర్.

"సార్ మేము ...... అక్కడ .... కొంచెంసేపు .... " అని భయంతో ముక్కలు ముక్కలుగా చెప్పడం మొదలు పెట్టాడు.

"ఏంటయ్యా నీవు మాటల్ని ముక్కలు ముక్కలు చేసి మాట్లాడితే నేను వాటన్నిటిని అతికించుకుని అర్థం చేసుకోవాలా ? మీరు విషయాన్ని నాన్చినంత మాత్రాన అందులో మురికి పోయి తెల్లగా అవుతుందా ?" పళ్ళు పట పట లాడించారు ఇన్‌స్పెక్టర్.

"అదికాదు సార్. మేము భార్యాభర్తలన్న మాట నిజమే. కాని మాకు పెళ్ళయి పదేళ్ళయ్యింది. మాది పెద్దలు నిర్ణయించిన పెళ్ళి. నాకు ప్రేమించి పెళ్ళి చేసుకోవటం ఏమిటో తెలియదు. ఈరోజు వాలెంటైన్స్ డే కదా ! అందుకని వెరైటీగా వుంటుందని నేనే మా ఆవిడతో చెప్పి ఈ ఒక్కరోజు ప్రేమికుల్లాగా నటిద్దామన్నాను" ముగించాడు సుబ్బారావు.

"స్టోరీ బాగుంది ! డైరెక్టరు ఎవరు ?" అని వ్యంగ్యంగా అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"నేనే సార్" గర్వంగా చెప్పాడు సుబ్బారావు.

"చుప్!! నిజం చెప్పు లేదా మిమ్మల్నిద్దర్ని లోపల తోయాల్సొస్తుంది" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"మేం చెప్పేది నిజం సార్. మాకు ఇద్దరు పిల్లలు కూడా వున్నారు. కావాలంటే మా ఆవిడ్నడగండి" నమ్మమన్నట్లు అన్నాడు సుబ్బారావు.

"అవునండి పాపం మంచి పిల్లలు. స్కూల్‌కి వెళ్ళారు" సిగ్గుపడుతూ అంది సుజాత.

ఈలోపు మొదటివాడు, రెండోవాడు చేతిలో రెండు దండలతో వచ్చారు.

"సార్, ఈ దండల్ని మార్చుకోమనండి" అంటూ దండల్ని ఇన్‌స్పెక్టర్ చేతికిచ్చాడు మొదటివాడు.

మొదటివాడు గోపాల్, ఆ ఏరియా యూత్ అసోసియేషన్ ప్రెసిడెంట్, రెండోవాడు సుధీర్, సెక్రటరీ అని ఇన్‌స్పెక్టర్ చెప్పాడు.

ఆరోజు వాలంటైన్స్‌డే (ప్రేమికుల దినం) కాబట్టి ప్రేమజంటలు ఎవరైనా పబ్లిక్ ప్లేస్‌లో కనపడితే వాళ్ళకు పెళ్ళిచేస్తామని అసోసియేషన్ పత్రికల్లో ప్రకటించింది. దానికి పోలీసుల సహాయం కోరారని ఇన్‌స్పెక్టర్ చెప్పాడు.

"వాలంటైన్స్ డే మన సంస్కృతి కాదు. అది వెస్టన్ కల్చర్. దాని మునుగులో ఎందరో ఆడవాళ్ళు మోసపోతున్నారు. అందుకనే విచ్చలవిడిగా తిరిగే ప్రేమజంటలకి పెళ్ళిచేస్తున్నాము" అన్నారు ఆ ఏరియా యూత్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గోపాల్.

"అయినా మాకు ఆల్‌రెడీ పెళ్ళయింది సార్. మమ్మల్ని వదిలేస్తే మేం ఇంటికి వెళ్ళిపోతాం" అన్నాడు సుబ్బారావు.

"అదేం కుదరదు మీరు దండలు మార్చుకుని, ఈ పసుపుతాడుని తాళిగ కడితే తప్ప మేం వదలం" అన్నాడు సెక్రటరీ సుధీర్.

"సార్ ! కావాలంటే మా చెల్లి ఫోన్ నెంబర్ ఇస్తాను. మీరు ఎన్‌క్వయిరీ చేసి కనుక్కోండి" అన్నాడు సుబ్బారావు.

"మేము ఫోన్ చేస్తాము గాని మీరు ఈలోపు దండలు మార్చుకోండి" అన్నాడు ఇన్‌స్పెక్టర్ ఫోన్‌నెంబర్ తీసుకుంటూ.....

అరగంటలో సుబ్బారావు చెల్లి స్కూల్ నుండి పిల్లల్ని తీసుకుని కంగారుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి వాళ్ళను చూసి అవాక్కయ్యింది.

"ఏమైందన్నయ్యా ? ఏంటీ దండలు ?" అడిగింది సుగుణ.

"అదంతా ఇంటి దగ్గర చెప్తాలే" అని...

"సార్ మమ్మల్ని ఇకనైనా వదిలేస్తే ఇంటికి వెళ్ళిపోతాము. ఇక మీదట ఇటువంటి పన్లేమి చేయము" అన్నాడు సుబ్బారావు.

యూత్ అసోసియేషన్ వాళ్ళకు నమ్మకం కుదిరాక ఇన్‌స్పెక్టర్‌కి చెప్పి వాళ్ళను వెళ్ళమన్నారు.

ఇంటికొచ్చిన తరువాత జరిగిందంతా సుగుణకి వివరంగా చెప్పాడు సుబ్బారావు. సుగుణకి నవ్వాగలేదు.

"నేను వద్దంటుంటే ఈయనే పెద్దప్లాన్ అంటూ నన్ను తీసుకెళ్ళారు. ఇప్పుడేమైందో చూడు" అంటూ సిగ్గుతో తలవంచుకుంది సుజాత.

"ఏమైంది మనకు మళ్ళీ పెళ్ళి జరిగింది" అన్నాడు సుబ్బారావు అందరూ నవ్వుతుంటే.